సాక్షి చిత్తూరు

దీపావళి శుభాకాంక్షలు

సోమవారం । 20 । అక్టోబర్ । 2025

న్యూస్‌రీల్

పెరిగిన గార్గేయ ఉధృతి



సదుం: మండలంతో పాటు ఎగువన సోమల మండలంలో గత కొద్ది రోజులుగా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి నుంచి మండల పరిధిలోని గార్గేయ నదిలో వరద ప్రవాహం పెరిగింది. కొర్లగుంటవారిపల్లె సమీపంలోని కల్వర్టుపై వరద నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు కొంత మేర ఇబ్బందులు ఏర్పడ్డాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

ఉత్కంఠగా చదరంగం పోటీలు



చెస్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు నియోజకవర్గ స్థాయి చెస్ పోటీలు ఆదివారం ఉత్కంఠగా సాగాయి. చిత్తూరు నగరంలోని వేపమాను వీధిలో ఉన్న ది స్కూల్ ఆఫ్ చెస్ కేంద్రంలో నియోజకవర్గ స్థాయి చెస్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో అండర్- 7 విభాగంలో ఆదిత్య, ఆర్యన్, సిద్ధార్థ్, అండర్- 9 విభాగంలో ద్వారకా అర్జున్, మణిదీప్, సాత్విక్, అండర్-12లో అనంతనిత్య, కుందశ్రీ, విక్రాంత్, అండర్-16లో యశ్వంత్ సాయికార్తిక్, అక్షర, లోహిత్ వరుస స్థానాల్లో విజేతలుగా గెలుపొందారు. గెలుపొందిన విజేతలకు ఏపీ చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఆర్‌బీ ప్రసాద్ బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాల సోమనాథ్, లేఖ్య, దినేష్, సాయి, హరి, హరీష్ పాల్గొన్నారు.

పంటలు ధ్వంసం



మామిడి కొమ్మలను విరిచేసిన ఏనుగులు

పులిచెర్ల(కల్లూరు): ఏనుగుల దాడులతో పంటలు సర్వనాశనమవుతున్నాయి. ఆదివారం తెల్లవారు జామున మండలంలోని పాళెం పంచాయతీ, జూపల్లె గ్రామ పరిసర ప్రాంతాల్లో ఏనుగులు ప్రవేశించి పంటలను నాశనం చేశాయి. ఎక్కువగా మామిడి కొమ్మలను విరిచేయడం, తోట చుట్టూ వేసిన ముళ్ల కంచెను తొక్కేయడం, పశుగ్రాసాన్ని తొక్కి చిందర వందర చేయడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ఏనుగులు రాకుండా అధికారులు కట్టడి చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

నరక దారి

అధ్వాన్నంగా గ్రామీణ రహదారులు

- అడుగు పెట్టలేని దుస్థితిలో పల్లెసీమలు
- పూర్తి స్థాయిలో ఛిద్రమైన రోడ్లు
- ఎటుచూసినా బురద.. గుంతలు
- సంక్రాంతి సంగతి దేవుడెరుగు.. దీపావళి వచ్చినా పట్టించుకోని పాలకులు



చిత్తూరు : ఇందిరానగర్ వద్ద మురుగునీటి మధ్యే రాకపోకలు



నింద్ర : అధ్వాన్నంగా రహదారి



శాంతిపురం : కంకరతేలిన ముద్దనపల్లి రోడ్డు

తిరుపతి..చిత్తూరు జిల్లాల్లో గ్రామీణ రహదారులు గుంతలమయంగా మారిపోయాయి. వర్షాకాలం నేపథ్యంలో పూర్తిగా ఛిద్రమయ్యాయి. సంక్రాంతి నాటికే రోడ్లన్నీ అభివృద్ధి చేస్తామని ఆర్భాటంగా ప్రకటించిన చంద్రబాబు మాటలు నీటిమూటలుగా మిగిలిపోయాయి. అడుగుకో మడుగును తలపిస్తున్న మార్గాల్లో పల్లెవాసుల రాకపోకలు ప్రమాదకరంగా మారాయి. ఈ క్రమంలోనే ఇసుక.. గ్రావెల్ మాఫియా కారణంగా రహదారులు మరింతగా దెబ్బతిన్నాయి. అతి వేగంతో వెళుతున్న భారీ వాహనాల తాకిడికి సీసీ రోడ్లు సైతం శిథిలావస్థకు చేరాయి. అక్కడక్కడా నాణ్యతాప్రమాణాలను గాలికి వదిలి అరకొరగా మరమ్మతులు చేసిన మార్గాలు కూడా మళ్లీ ధ్వంసమయ్యాయి. ఈ మేరకు కూటమి సర్కారు నిర్లక్ష్య వైఖరిపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో పల్లెదారులను అద్భుతంగా తీర్చిదిద్దుతామని ఊదరగొట్టి.. అధికారంలోకి వచ్చిన తర్వాత చేతులెత్తేయడంపై మండిపడుతున్నారు. ఈ ఏడాది పెద్ద పండుగ జరుపుకునేందుకు స్వగ్రామాలకు చేరుకునే వారికి చూడముచ్చటైన మార్గాలు స్వాగతం పలుకుతాయని ప్రకటనలు గుప్పించి.. దీపావళి వచ్చినా గతుకుల.. అతుకుల రోడ్లతోనే సరిపెట్టి అవస్థలు పాలు చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ప్రతినిధి, తిరుపతి



జీడీ నెల్లూరు: ఏటుకూరుపల్లిలో రోడ్డు దుస్థితి



బైరెడ్డిపల్లె : పాతపేటలో బురదమయంగా తారురోడ్డు



పూతలపట్టు : కట్టకింద గ్రామ సమీపంలో రహదారి దుస్థితి





పలమనేరు : మొసళ్లమడుగు నుంచి ఒంటిండ్లకు వెళ్లే బురద రహదారులు ఇలా..

అక్రమార్కుల్లో దడ

కరువు ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి కల్పించి వలసల నివారణ కోసం కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అమలు చేస్తుంటే..రాష్ట్రంలో అధికారం మాదే..అడిగేదెవరు , అడ్డొచ్చేదెవరు.. అంటూ పుంగనూరు నియోజకవర్గంలో ఉపాధి పనుల్లో తమ్ముళ్లు నిధులను అడ్డంగా దోచేశారు. దీనిపై విజిలెన్స్ బృందాలు రంగంలోకి దిగుతుండడంతో అక్రమార్కుల్లో దడ మొదలైంది.

- ఉపాధి నిధుల స్వాహాపై ఎంపీ ఇచ్చిన లేఖకు కేంద్రం స్పందన
- 21 నుంచి రంగంలోకి విజిలెన్స్ బృందాలు
- హడలిపోతున్న సిబ్బంది అక్రమాలు బయటపడేనా !



సదుం : గొంగివారిపల్లె క్యాటిల్ పాండ్‌ను జేసీబీతో చేస్తున్న దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : పుంగనూరు నియోజకవర్గంలో 2024–25లో రూ.65 కోట్లు ఉపాధి కోసం ఖర్చు చేసినట్లు లెక్కలు చూపి నిధులు బొక్కేశారు. దీనిపై రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిధున్‌రెడ్డి ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీనిపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని కోరారు. స్పందించిన కేంద్ర ప్రభుత్వం , రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ పుంగనూరు నియోజకవర్గంలోని 6 మండలాల్లో విజిలెన్స్ విచారణ చేపట్టి, నివేదికలు పంపాలని ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ శ్రీభవాని హర్ష ఈనెల 15న చిత్తూరు జిల్లా పీడీ డ్వామాకు ఆదేశాలు జారీ చేశారు. పుంగనూరు నియోజకవర్గంలోని 6 మండలాల్లో 28 మంది సభ్యులతో ఈనెల 21 నుంచి 23 వరకు పనుల అక్రమాలపై విచారణ చేపట్టి, నివేదికలు పంపాలని ఆదేశించారు. విజిలెన్స్ బృందానికి సంబంధిత రికార్డులను అందించాలని పేర్కొన్నారు. విజిలెన్స్ విచారణకు రానుండడంతో ఉపాధి హామీ అధికారుల గుండెల్లో వణుకు పుడుతోంది. అధికార పార్టీకి తలొగ్గి , నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో పనులు చేపట్టారు. ప్రస్తుతం విజిలెన్స్ విచారణలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయోనని హడలి పోతున్నారు.

పాత పనులకు కొత్త మెరుగులు

ఉపాధి పథకంలో నియోజకవర్గంలోని ఓ ప్రధాన నాయకుడికి చెందిన రెండు మండలాల్లో కోట్లాది రూపాయలు ఖర్చు చేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఏ పంచాయతీలోనూ ఎన్నడూ ఖర్చు చేయని విధంగా ఒక్కో పంచాయతీలో ఖర్చు చేయడం విమర్శలకు దారి తీస్తోంది. పాత పనులను కూటమి నాయకులు యంత్రాలతో కొత్త మెరుగులు దిద్ది, ఉపాధి పథకంలో అక్రమాలకు పాల్పడ్డారని విమర్శలు వస్తున్నాయి. రొంపిచెర్ల మండలంలోని పెద్దగొట్టిగల్లు పంచాయతీలో గతంలో వాటర్‌షెడ్ పథకం కింద చేసిన పనులకు ప్రస్తుతం ఉపాధిలో పెట్టి బిల్లులు చేసుకున్నారని విమర్శిస్తున్నారు. రొంపిచెర్ల మండలంలో 12 పంచాయతీలు ఉండగా అందులో 8 పంచాయతీల్లో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి అక్రమాలలో అందనంత ఎత్తుకు వెళ్లినట్లు సమాచారం. మండలంలోని గానుగచింతలో రూ.2.10 కోట్లు, రొంపిచెర్లలో రూ.1.62 కోట్లు, పెద్దగొట్టిగల్లులో రూ.1.50 కోట్లు, సీహెచ్ రెడ్డిగారిపల్లిలో రూ.1.42 కోట్లు, మోటుమల్లెలో రూ.1.43 కోట్లు, చిచ్చిలివారిపల్లిలో రూ.1.29 కోట్లు, బోడిపాటివారిపల్లిలో రూ.1.20 కోట్లు , అలాగే పులిచెర్ల మండలం కావేటిగారిపల్లెలో రూ.1.54 కోట్లు, కల్లూరులో రూ.1.20 కోట్లు, సోమల మండలం నంజంపేటలో రూ.1.30 కోట్లు, కందూరులో కోటి రూపాయలు ఖర్చు చేసినట్లు రికార్డులు సృష్టించారు.

రికార్డుల్లోనే ఖర్చులు.. క్షేత్ర స్థాయిలో కనిపించని పనులు



టీడీపీ నేత ఫీల్డ్ అసిస్టెంట్లు తమ వారిని నియమించాలని ఎంపీడీవోలకు రాసిన లేఖ

జాతీయ ఉపాధి హామీ పథకంలో జరిగిన పనుల్లో అక్రమాలలో పుంగనూరు నియోజకవర్గం టాప్‌గా నిలిచింది. నియోజకవర్గంలోని మూడు మండలాలు అక్రమాలలో అగ్రస్థానంలో ఉంది. పులిచెర్ల మండలంలో మొత్తం రూ.16.07 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో కూలీల వేతనం కింద రూ.12.13 కోట్లు, మెటీరియల్ కింద రూ.3.94 కోట్లు , రొంపిచెర్ల మండలంలో రూ.15.01 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో కూలీల వేతనం కింద రూ.13.45 కోట్లు, మెటీరియల్ కింద రూ.1.65 కోట్లు, సోమల మండలంలో రూ.10.99 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో కూలీల వేతనం కింద రూ.7.32 కోట్లు, మెటీరియల్ కింద రూ.3.67 కోట్లు ఖర్చు చేసినట్లు రికార్డులు సృష్టించారు.

యంత్రాలతో పనులు

ఉపాధిహామీ పథకంలో పనులు చేపట్టాలంటే ముందుగా గ్రామీణ స్థాయిలో ప్రజలు కలసి పనిని ఎంపిక చేయాలి. లేబర్ బడ్జెట్ తయారు చేసి అందుకు అనుగుణంగా రైతులు, ప్రజలకు అనుగుణంగా అర్హతను బట్టి పనులను ఎంపిక చేయాలి. ఆ పనులను సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ తీర్మానం ఆమోదించాలి. ఆ పనులను మండల పరిషత్‌లో ఆమోదించాలి. ఈ పనులకు ఎస్టిమేట్లు వేసి పరిపాలన అనుమతులు కలెక్టర్ ద్వారా పొందాలి. తరువాత పనులను ప్రారంభించాల్సి ఉంది. కానీ కూటమి నాయకులు వీటికి తిలోదకాలు ఇచ్చి , ఏకపక్షంగా తమకు నచ్చిన వారికి పనులు కల్పిస్తూ , ఆ పనులను కూలీలతో చేయించకుండా యంత్రాలతో చేయిస్తూ ఉపాధి నిధులు దోచుకుంటున్నారు. ఇలాంటి అక్రమాలను తన వారిచే చేయించుకునేందుకు టీడీపీ నేత చల్లా రామచంద్రారెడ్డి ఎంపీడీవోలకు పలు లేఖలు రాసి తనకు నచ్చిన వారిని ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించుకుని, పాత వారిని తొలగించారనే విమర్శలు ఉన్నాయి.



క్యాటిల్‌పాండ్‌ను జేసీబీతోనే చేస్తున్న దృశ్యం

ప్రతి ఇంటా వెలుగులు వెదజల్లాలి



మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి



శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్




సుమిత్‌కుమార్, కలెక్టర్



ఎస్పీ, తుషార్ డూడీ

పుంగనూరు: దీపావళి పండుగను ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం వారిద్దరూ విడివిడిగా మాట్లాడుతూ ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలసి జాగ్రత్తగా దీపావళి జరుపుకోవాలని సూచించారు. వీరితోపాటు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, ఎస్పీ తుషార్ డూడీ పండుగ ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు.

బీర్జేపల్లెలో పిడుగు పాటు



పిడుగుపాటుకు కాలిపోయిన వైర్లు



ఇంటిపై పిడుగు పాటుకు గురైన ప్రాంతం

- రూ.1.50 ఆస్తి నష్టం
- ఒకరికి అస్వస్థత

చౌడేపల్లె: మండలంలోని చారాల పంచాయతీ, బీర్జేపల్లెలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షంతో పాటు రెండు ఇళ్లపై పిడుగులు పడ్డాయి. దీంతో రూ.1.50 లక్షల మేరకు ఆస్తినష్టం వాటిల్లింది. శనివారం రాత్రి ఎడతెరపి లేకుండా వర్షం పడింది. ఒక్కసారిగా మెరుపులు, ఉరుములు మొదలయ్యాయి. బీర్జేపల్లె గ్రామానికి చెందిన ఎస్.చంద్ర ఇంటి ముందుగల టెంకాయ చెట్టు తోపాటు నూతనంగా నిర్మించిన ఇంటిపై పిడుగుపడింది. చంద్ర ఇంట్లో విద్యుత్ వైర్లు అన్నీ కాలిపోయాయి. అలాగే పక్కనే ఉన్న శీనప్పకు చెందిన ఇంట్లో కూడా విద్యుత్ సామగ్రి కాలిపోయింది. పిడుగుపాటు శీనప్ప షాక్ గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా

గ్రీవెన్స్ రద్దు

చిత్తూరు అర్బన్: చిత్తూరులో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని దీపావళి పండుగ నేపథ్యంలో రద్దు చేస్తున్నట్లు ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. అలాగే చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో సైతం గ్రీవెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు.

భార్య కాపురానికి రాలేదని..

యాదమరి: కుటుంబ కలహాలతో పుట్టింటికి వెళ్లిన భార్య కాపురానికి రాకపోవడంతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. మండల పరిధిలోని తెల్లరాళ్లపల్లి పంచాయతీ, పావడదాసూరు గ్రామానికి చెందిన బాలయ్య కుమారుడు మునెప్ప(35) దినసరి కూలీ. కుటుంబ పోషణకు ఇతరుల నుంచి కొంత అప్పుగా తీసుకున్నాడు. అయితే వాటిని చెల్లించే క్రమంలో విఫలమవడంతో అప్పుల వాళ్లు ఇంటి దగ్గరకు వచ్చి వేధించేవారు. దీంతో అతని భార్య సౌజన్య ఆ అవమానాన్ని భరించలేక మూడు నెలల క్రితం పుట్టింటికి వెళ్లింది. తను ఎంతకీ తిరిగి రాకపోవడంతో మనస్తాపానికి గురైన మునెప్ప ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతని తల్లి చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మునెప్ప మృతి చెందాడు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆయిల్ ట్యాంకర్ బోల్తా



ట్యాంకర్‌ను పక్కకు తీస్తున్న ఐఓసీ సిబ్బంది

బంగారుపాళెం : మండలంలోని సంక్రాంతిపల్లె వద్ద ఆదివారం చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ఓ ఆయిల్ ట్యాంకర్ బోల్తా పడింది. ఈ సంఘటనతో పెద్ద ప్రమాదం తప్పింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు, పలమనేరు వైపు నుంచి చిత్తూరు వెళ్తున్న కారు సంక్రాంతి పల్లె వద్ద కు రాగానే ఓ ద్విచక్రవాహనదారుడు ఒక్కసారిగా అడ్డు రావడంతో ఎడమవైపు పోతున్న కారు.. యాదమరి నుంచి వస్తున్న ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో ట్యాంకర్ రహదారిపై బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులతో పాటు ట్యాంకర్ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. జాతీయ రహదారిపై ట్యాంకర్ బోల్తా పడడంతో అందులో ఉన్న పెట్రోల్, డీజల్ లీకై ఎక్కడ మంటలు చెలరేగుతాయోనని గ్రామస్తులు భయాందోళనకు గురైయ్యారు. ప్రమాద సమాచారం అందుకున్న బంగారుపాళెం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సమాచారాన్ని ఐఓసీ సిబ్బందికి తెలియజేయడంతో వారు సంక్రాంతిపల్లె వద్దకు చేరుకున్నారు. బోల్తా పడిన ఆయిల్ ట్యాంక్ నుంచి మరో వాహనంలోకి డీజల్, పెట్రో ల్ నింపారు. రహదారిపై బోల్తా పడిన ట్యాంకర్‌ను క్రేన్ల సాయంతో రహదారి పక్కకు తొలగించారు. ట్యాంకర్ బోల్తా పడడంతో జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మా రింది. ట్యాంకర్‌కు మంటలు చెలరేగి ఉంటే పెద్ద ప్రమాదం జరిగేదని స్థానికులు అంటున్నారు.

- చిన్నారులను అనారోగ్యం బారిన పడేస్తున్న వైనం
- తమిళనాడు, కర్ణాటక నుంచి జిల్లాకు మందుల సరఫరా
- కమీషన్ అధికంగా వచ్చే మందులనే రెఫర్ చేస్తున్న వైద్యులు
- పలు ప్రైవేటు ఆస్పత్రుల కమీషన్ల కక్కుర్తి
- పట్టించుకోని ఆరోగ్యశాఖ అధికారులు

కమీషన్ల వైద్యం



చిత్తూరు రూరల్ (కాణిపాకం) : మధ్యప్రదేశ్‌లో కోల్డ్రిఫ్ అనే దగ్గు సిరఫ్ పసి ప్రాణాలను బలిగొంది. అలాగే రాజస్థాన్‌లోని మరణాలు సంభవించాయి. సిరఫ్ తీసుకున్న పిల్లలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. జ్వరం, పొట్ట ఉబ్బిపోయి...మూత్ర పిండాలు దెబ్బతినడంతో మరణాలు సంభవించాయి. ఈ విషయం దేశ వ్యాప్తంగా కలకలం సృష్టించడంతో ఆందోళనకు దారి తీసింది. ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు వైద్యంలో భద్రతను ప్రశ్నిస్తోంది.

కాసుల కక్కుర్తి

జిల్లాలో మెడికల్ మాఫియా రెచ్చిపోతోంది. ఇష్టారాజ్యంగా తమిళనాడు, కర్ణాటక నుంచి జిల్లాలో మందులు, మాత్రల వ్యాపారాన్ని నడిపిస్తోంది. కాసుల కక్కుర్తికి పాల్పడుతోంది. నాణ్యత లేని వాటిని అంటగడుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రులు నిబంధనలు అతిక్రమిస్తోంది. ప్రధానంగా పసి వైద్యం పెనుగండంగా మారింది. పసి ప్రాణాలను బలి తీసుకుంటోంది. అయినా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలో ఇలా..

జిల్లాలో అధికారికంగా 1200 ప్రైవేటు ఆస్పత్రులున్నాయి. అనాధికారికంగా 1000పైగా నడస్తున్నాయి,. ఆర్ఎంపీ క్లీనిక్‌లు 2వేల వరకు ఉంటున్నాయి. ఇటీవల 150 వరకు నకిలీ ఆర్ఎంపీలు పట్టుబడగా..ఇంకా వేల మంది నకిలీ ఆర్ఎంపీల అవతారాన్ని గుట్టు రట్టు చేయాల్సి ఉంది. దీనికి తోడు మెడికల్ షాపులు 1500 వరకు ఉన్నాయి. వీటిలో చాలా వరకు నిబంధనలు అతి క్రమిస్తున్నాయి. ఇష్టానుసారంగా మందులు, మాత్రలు అమ్మేస్తున్నాయి.

అనుమతి లేని ఏజెన్సీలు

తమిళనాడు, కర్ణాటక రాష్ట్రం నుంచి జిల్లాకు అత్యధికంగా మందులు, మాత్రలు సరఫరా అవుతున్నాయి. నిత్యం రూ. కోటి విలువ చేసే మెడిషన్లు జిల్లాకు దిగుమతి అవున్నాయి. రోజు వారీగా రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు వ్యాపారం నడుస్తోంది. ఇదే అదునుగా చేసుకుని మెడికల్ ఏజెన్సీలు పుట్టగొడుగులా పుట్టుకొచ్చాయి. జిల్లాలో 40పైగా ఏజెన్సీలు ఉండగా... అనుమతులు లేని ఏజెన్సీలు పదుల సంఖ్యలో ఉన్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ కారణంగా కొన్ని నాణ్యత లేని మందులు, మాత్రలు మార్కెట్లోకి చేరిపోతున్నాయని అంటున్నారు. కంపెనీలు కొత్తగా తయారు చేసిన మందులు, మాత్రలు డ్రగ్స్ కంట్రోల్ అనుమతులు రాకముందే మార్కెట్‌లోకి వచ్చేస్తున్నాయని వెల్లడిస్తున్నారు. చాలా మంది వైద్యులు కమీషన్లకు కుక్కర్తి పడి... నాణ్యత లేని మందులను రెఫర్ చేస్తున్నారని, ఇది ప్రజానీకానికి ప్రమాదం పొంచి ఉందని పలువురు నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కోల్డ్రిఫ్‌లో ఏముంది..

మధ్యప్రదేశ్‌లో దగ్గు సిరఫ్ తీసుకున్న పిల్లలు మరణించారు. అక్కడి ప్రభుత్వం చేపట్టిన పరిశీలనలో పలు విషయాలు బయటకొచ్చాయి. తమిళనాడు ప్రభుత్వం సైతం ఆ సిరఫ్‌పై పరిశీలన చేయగా వాస్తవాలను బయటపెట్టి..ఉత్పత్తిని ఆపేసింది. కోల్డ్రిఫ్ అనే దగ్గు సిరఫ్‌లో (బ్యాచ్ నంబర్ -ఎస్ఆర్ -13), డై ఇథైలిన్ గ్లైకాల్ (డీఈజీ-48.6 శాతం) అనే ప్రమాదకర రసాయనం పరిమితికి మించి ఉన్నట్లు తేలింది. ఇదంతా పిల్లలను హరించేలా పనిచేస్తాయని వెలుగులోకి వచ్చింది. ప్రధానంగా ఇదీ కిడ్నీపై ప్రభావితం చేస్తోందని బయట పడింది.

కట్టడి చర్యలు ఏమాత్రం...

మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన ఘటనలు చూసి కూడా జిల్లా అధికారుల్లో కనీస చలనం లేదు. జిల్లాలో అనధికారిక ఆస్పత్రులు కుప్పలు తెప్పలుగా ఉన్న చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. జిల్లాలో పలు ఆర్ఎంపీల వద్ద చికిత్స తీసుకుని పిల్లలు మృతి చెందిన ఘటనలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, డ్రగ్స్ నియంత్రణ శాఖ అధికారులకు కనువిప్పు కలిగించడం లేదు. ఇలానే వదిలేస్తే..మరో మధ్యప్రదేశ్ వంటి ఘటనలను జిల్లాలో చూడక తప్పదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

చిన్న పిల్లల మందులు సైతం...

జిల్లాలో ప్రధానంగా గుండె, బీపీ, షుగర్, క్యాన్సర్, తదితర సమస్యలకు సంబంధించిన మందులు, మాత్రలు మాత్రమే ఎక్కువగా అమ్ముడుబోతున్నాయి. తర్వాత గర్భిణులు, చిన్నపిల్లలకు సంబంధించిన మాత్రలు అధిక మొత్తంలో విక్రయాలు జరుగుతున్నాయి. కానీ పిల్లల విషయంలో చాలా మంది వైద్యులు సరైన నిబంధనలు పాటించడం లేదు. చికిత్స చేయడంతో పాటు జ్వరం, జలుబు వంటి వాటికి కూడా ఇంజెక్షన్లు, సిరఫ్ ఇచ్చేస్తున్నారనేది ఇప్పుడు ప్రధానమైన వాదనగా నడుస్తోంది. అందులోనూ అధికంగా కమీషన్ ఇచ్చే మందులు, మాత్రలను మాత్రమే రెఫర్ చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. మధ్యప్రదేశ్‌లో తరహాలో జిల్లాలో కూడా చాలా మంది వైద్యులు చిన్న పిల్లల దగ్గు, జలుబు నివారణకు కోల్డ్రిఫ్‌ను రెఫర్ చేశారని పలువురు అంటున్నారు. ఈ కోల్డ్రిఫ్ తయారీ కంపెనీ తమిళనాడులోని చెన్నైలో ఉండడం గమనార్హం.

పిల్లలకు సొంత వైద్యం వద్దు



దగ్గు రావడానికి పలు రకాల కారణాలు ఉంటాయి. పెద్దలకు మాత్రమే కాదు. పిల్లలకు కూడా పలు సమస్యల తో దగ్గు వస్తుంది. అలా అని వెంటనే మెడికల్ షాపులకు వెళ్లి దగ్గు సిరఫ్ కొని ఇష్టానుసారంగా ఇచ్చేస్తున్నారు. ఇదీ ప్రమాదకరం. భవిష్యత్తులో పలు అనారోగ్య సమస్యలకు దారి తీస్తాయి. కచ్చితంగా డాక్టర్ల సలహా మేరకు సిరఫ్‌లు, మాత్రలు వాడాలి.

– అశోక్‌కుమార్, వైద్య నిపుణులు, చిత్తూరు

వైద్యుల సలహాతో సిరఫ్‌లు ఇవ్వాలి



రెండేళ్ల వరకు పిల్లలకు ఏ డాక్టర్ కూడా సిరఫ్‌లు ఇవ్వరు. సెలనైజెడ్ డ్రాప్స్ ఇస్తారు. చిన్న రెమిడీస్ చెబుతారు. పిల్లలు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారన్న సమయంలో మాత్రమే సిరఫ్‌లు ఇస్తారు. ఆ సిరఫ్‌లను కూడా ఇష్టానుసారంగా ఇవ్వకూడదు.

– ఆశ్రిత, చిన్న పిల్లల వైద్య నిపుణులు

చర్యలు తీసుకుంటాం..



ఇది వరకే అనధికారిక ఆస్పత్రుల వివరాలు పూర్తి స్థాయిలో సేకరించాం. జిల్లా యంత్రాంగం ఆదేశాల మేరకు కచ్చితంగా తనిఖీలు చేస్తాం. రిజిస్ట్రేషన్ చేసుకోని ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటాం. ఆర్ఎంపీలు చిన్న పిల్లలకు వైద్యం చేస్తున్నారని తెలిస్తే వదిలిపెట్టం. ఇప్పటికే నకిలీ ఆర్ఎంపీ కేంద్రాలకు తాళాలు వేశాం.

– సుధారాణి, డీఎంహెచ్ఓ, చిత్తూరు

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎన్నికైన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం కార్యవర్గం

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వినాయకం అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కణ్ణన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆ సంఘం జిల్లా నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులు భవిష్యత్‌లో ఉద్యోగాలు పొందేందుకు ఉచిత శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో కచ్చితంగా అంబేడ్కర్ చిత్రపటాన్ని పెట్టాలన్నారు.

నూతన కార్యవర్గం

జిల్లా అధ్యక్షులుగా మురళి, ప్రధాన కార్యదర్శిగా భాస్కర్, గౌరవ అధ్యక్షులుగా ఓబులేశు, ఆర్థిక కార్యదర్శిగా షణ్ముగం, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా సంతానం, జిల్లా అడిషనల్ సెక్రటరీగా వినాయక, జిల్లా కన్వీనర్‌గా బాబు, జిల్లా ఉపాధ్యక్షులుగా సుబ్రహ్మణ్యం, ప్రసాద్, రమేష్, నవీన్, నరేష్, సుబ్బలక్ష్మి, ప్రణీత, రజనీని ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

ప్రమాదకరంగా చెరువు



చౌడేపల్లె : బుటకపల్లె చెరువు మధ్యలో కట్ట మట్టి జారి ప్రమాదకంగా ఉన్న దృశ్యం

చౌడేపల్లె : రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు, వాగుల్లోకి వరదనీరు చేరుతోంది. దుర్గ సముద్రం పంచాయతీ పరిధిలోని బుటకపల్లె చెరువు సుమారు వంద ఎకరాల విస్తీర్ణం ఉంది. ఈ చెరువు నిండి మొరవ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువనున్న చిన్నపాటి కుంటలు, చెరువులు మొరవలు వెళ్లడంతో ఊహించని మేరకు వరద నీరు బుటకపల్లె చెరువుకు చేరుతోంది. చెరువు కట్ట మధ్యలో ఓ చోట మట్టి జారి కట్ట సగభాగం వరకు కోతకు గురై నీరు బయటకు వెళ్తోంది. మళ్లీ వర్షం కురిసినా లేదా వరద నీటి ఉదధృతి పెరిగితే కట్ట తెగిపోయే అవకాశం ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అంటూ ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే శెట్టిపేట పెద్ద చెరువుకు గండి పడింది. నీరు గండి ద్వారా బయటకు ప్రవహిస్తోంది. కట్ట తెగిపోయే ప్రమాదం పొంచి ఉంది. ఈ విషయమైన రైతులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం సంభవించకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

– ముగ్గురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో క్షతగాత్రులు

శ్రీరంగరాజపురం : రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెంది, ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారి సంగం పాల డెయిరీ వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు పెనుమూరు మండలం ఒడ్డుపల్లి గ్రామానికి చెందిన హేమాద్రి(36), ప్రసాద్(54), రమేష్(47) తన స్నేహితులతో కలిసి పళ్లిపట్టుకు ఆటోలో వెళ్తుండగా గంగాధర నెల్లూరు మండలం వేటుకురుపల్లి గ్రామానికి చెందిన ఏ.సుబ్రమణ్యం (60) కార్వేటినగరం పాదిరికుప్పంలో తమ సమీప బంధువుల ఇంటికి వెళ్లి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో తిరిగి వస్తుండగా మార్గమధ్యలో సంగం పాలడెయిరీ వద్ద ఆటో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో సుబ్రమణ్యంకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు 108 వాహనం ద్వారా గాయపడిన క్షతగాత్రులను స్థానికుల సహాయంతో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి సీఎంసీకి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మాజీ ఆర్మీ జవాన్ ఇంట్లో చోరీ



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పూతలపట్టు(యాదమరి): ఓ మాజీ ఆర్మీ జవాన్ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీ చేసిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. భాదితుల కథనం.. మండల పరిధిలోని, పి.కొత్తకోట పంచాయతీ చౌటపల్లి దళితవాడలో చిన్నపాపమ్మ నివాసం ఉంటోంది. తన కుమారుడైన దాము ఆర్మీలో పదవీ విరమణ చెంది తిరుపతిలోని ఓ సెక్యూరిటీ సంస్థలో విధులు నిర్వర్తిస్తున్నారు. శుక్రవారం ఆమె తిరుపతిలో నివాసం ఉంటున్న తన కుమారుడు ఇంటికి వెళ్లింది. అయితే దీపావళి పండుగ నిమిత్తం స్వగ్రామానికి వచ్చిన వీరికి తమ ఇంటి తలుపులు తెరచి ఉండడాన్ని గమనించారు. వెంటనే లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని 60 గ్రాముల బంగారు ఆభరణాలు, వెండి పట్టీలు, రూ.50వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించగా.. వారు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పక్కా ప్రణాలికతోనే దుండగులు రెక్కీ నిర్వహించి చోరీకి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. భాదితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు సీఐ కృష్ణమోహన్ తెలిపారు.

రంకెలేసిన ఉత్సాహం



దూసుకుపోతున్న కోడెగిత్తలు



గ్రామంలో జన సందడి

వెదురుకుప్పం: ఉత్సాహం ఉరకలేసింది...కాలుదువ్విన కోడె గిత్తలు ... జనసమూహాన్ని చీల్చుకుంటూ దూసుకుపోయిన పోట్లగిత్తలు తమ పౌరుషాన్ని చూపాయి. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని కొండకిందపల్లెలో జరిగిన జల్లికట్టు జోష్ తెచ్చింది. యువత కేరింతల మధ్య జరిగిన జల్లికట్టు దుమ్ము రేపింది. నిర్వాహకులు ముందుగా ఎడ్లకు పలకలు, వస్త్రాలతో పాటు బెలూన్‌లు కట్టి పందేలకు సిద్ధం చేశారు. అంతకు ముందే వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో యువత అక్కడికి చేరుకున్నారు. పోట్లగిత్తలు రంకెలేస్తూ దూసుకుపోయాయి. పరుగులు తీస్తున్న ఎద్దును కట్టడి చేసేందుకు యువకులు ప్రయత్నించారు. ఎద్ల వేగాన్ని నిలువరించలేక చేతులెత్తేశారు. ఉత్సాహంతో పందెంలో పాల్గొన్న యువత పరుగులు తీస్తున్న కోడెగిత్తలను కట్టడి చేసి పలకలను లాక్కొన్నారు. కొన్ని ఎడ్లు జన ప్రవాహాన్ని సైతం లెక్కచేయకుండా యువతకు చిక్కకుండా పరుగులు తీశాయి. పశువుల కిందపడి కొందరికి గాయాలయ్యాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన వారితో గ్రామం జనంతో కిక్కిరిసింది.

'పాలారు'కు జలకళ



శాంతిపురం వద్ద ప్రవహిస్తున్న పాలారు నది

శాంతిపురం : ఎగువ ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురిసి ఆ వరద నీటితో పాలారు నది మళ్లీ జలకళను సంతరించుకుంది. కర్ణాటకలోని బేతమంగళ డ్యాం గేట్లు ఎత్తడం, సువిశాలమైన రామసాగర చెరువు నుంచి మూడు రోజులుగా మొరవ నీరు కిందికి ప్రవహిస్తోంది. దీంతో వి.కోట, రామకుప్పం మండలాల మీదుగా ప్రవహిస్తూ ఆదివారం తెల్లవారుజామున నీరు శాంతిపురం చేరాయి. ఇక్కడి నుంచి కుప్పం మండలం మీదుగా తమిళనాడుకు చేరనున్నాయి. స్థానికంగా భారీ వర్షాలు లేకపోయినా నదిలో నీటి రాకతో స్థానికులు శాంతిపురం చెక్ డ్యాం వద్దకు వచ్చి ఆసక్తిగా తిలకించారు. ఆదివారం బడుగుమాకులపల్లి వారపు సంత ఉండటం, దీని పక్కనే పాలారు నది ప్రవహించడంతో రోజంతా జనాల తాకిడి కనిపించింది. కాగా కర్ణాటక నుంచి వస్తున్న వరద నీటితో పాలారు నది ప్రవహిస్తుంటే సీఎం చంద్రబాబు హంద్రీనీవా కాలువ ద్వారా తెచ్చిన కృష్ణా నది జలాలు ప్రవహిస్తున్నాయని టీడీపీ శ్రేణులు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. నిజంగా నీరు ఎక్కడి నుంచి వస్తోందో తెలిసిన వారు ఈ పోస్టులను చూసి నవ్వుకొంటున్నారు.

ప్రైవేటీకరణ విరమించుకోవాలి

- రచ్చబండ కార్యక్రమంలో కోటి సంతకాల సేకరణ
- అధిక సంఖ్యలో పాల్గొన్న ప్రజలు, యువత, నాయకులు, కార్యకర్తలు
- పాల్గొన్న వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి



మాట్లాడుతున్న చిత్తూరు సమన్వయకర్త విజయానందరెడ్డి



కోటి సంతకాల కార్యక్రమంలో సంతకాలు చేస్తున్న యువత

చిత్తూరు కార్పొరేషన్ : పాలన చేతకాక వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న అసమర్థ కూటమి ప్రభుత్వాన్ని కోటి సంతకాల కార్యక్రమం ద్వారా నిలదీద్దామంటూ ప్రజలకు వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం చిత్తూరు నగరంలోని 34వ వార్డు కన్నయ్యనాయుడు కాలనీలో రచ్చబండలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు అను ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ పార్లమెంట్ కార్యదర్శి, పరిశీలకులు రెడ్డెప్ప కార్యక్రమంలో పాల్గొన్నారు. చిత్తూరు నియో జకవర్గ సమన్వకర్త విజయానంద రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా గత ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలలకు అనుమతులను తీసుకొచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలని చూడటం సిగ్గుచేటన్నారు. వైద్య విద్య అభ్యసించాలనుకునే విద్యార్థుల కోసం చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యులు కావాలని పిలుపు నిచ్చారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసి పేదల కడుపు కొడుతోందని మండిపడ్డారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ కాకుండా ఆపేందుకు పార్టీ ఆదేశాల మేరకు చిత్తూరు నియోజకవర్గంలో 60 వేల సంతకాలు సేకరిస్తున్నామన్నారు. సేకరించే సంతకాలను గవర్నర్, రాష్ట్రపతిలకు అందజేయనున్నట్లు తెలిపారు.

అనూహ్య స్పందన

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ప్రజా ఉద్యమంగా మారిందని విజయానందరెడ్డి అన్నారు. ప్రజా ఉద్యమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చిందన్నారు. పెద్ద ఎత్తున విద్యార్థులు, యువత, ప్రజలు తరలివచ్చి చంద్రబాబు వైఖరికి నిరసనగా సంతకాలు చేశారని తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేసే దుర్మార్గపు ఆలోచనను చంద్రబాబు వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ కార్యదర్శి, పరిశీలకులు రెడ్డెప్ప మాట్లాడుతూ.. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీపీ పేరుతో ప్రైవేటీకరణ చేయడం విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో విజయానందరెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా సంతకం చేశారు. అనంతరం మెడికల్ కళాశాలలకు వ్యతిరేకంగా ప్రజల నుంచి సంతకాలను సేకరించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, రెడ్డెప్ప, నౌషాద్, రమణ, హరిషారెడ్డి, కౌషర్, బిందురెడ్డి, మస్తాన్, యువత, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

మహిళపై దాడి



చేతిపై వాతలను చూపుతున్న శివమ్మ

శాంతిపురం : తమ వ్యవసా య భూమిని ఆక్రమించుకున్న వారిని అడ్డగించేందుకు వెళ్లిన తనపై దాడి చేశారని ఓ మహిళ రాళ్లబూదుగూరు పోలీసులను ఆశ్రయించింది. శనివారం జరిగిన దాడిపై బాధితురాలు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. బాధితురాలు ఎం.కె.పురానికి చెందిన శివమ్మ ఫిర్యాదు మేరకు వివరాలు.. కుమారుడు బెంగళూరులో ఉద్యోగం చేస్తుండగా ఆమె ఒంటరిగా గ్రామంలో ఉంటోంది. వీరికి వారసత్వ ఆస్తిగా సంక్రమించిన దానిలో 1.45 ఎకరాలను అదే గ్రామానికి చెందిన మరో కుటుంబం ఆక్రమించుకుందని తెలిపారు. దీనిపై శివమ్మ హైకోర్టును ఆశ్రయించడంతో తన ఆస్తిని స్వాధీనం చేసుకోవటం, అనుభవించటంలో జోక్యం చేసుకోవద్దని ఆదేశాలు ఇచ్చిందన్నారు. అయినా తనను సొంత భూమిలోనికి రానివ్వకపోవటంతో కోర్టు ఆదేశాలను అమలు చేయాలని ఇప్పటికే జిల్లా ఎస్పీ, కుప్పం ఆర్డీవో, డీఎస్పీ, కడ పీవోలకు వినతి పత్రాలు సమర్పించానని ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం తమ పొలంలో ప్రత్యర్థులు అరటి చెట్లు నాటుతున్నారని తెలిసి అడ్డుకునే ప్రయత్నం చేయడంతో వెంకటప్ప, వెంకటమ్మ, కృష్ణమూర్తి, పుష్ప తనపై దాడికి పాల్పడ్డారని ఆమె చెప్పారు. దీనిపై పోలీసు అధికారులు న్యాయం చేయాలని బాధితురాలు కోరారు.